# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## 16 వరకు ఎన్నికల కోడ్ అమలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఈ నెల 16వ తేదీ వరకు అమల్లో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదే రోజు మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని పేర్కొంది. కోడ్ ఉల్లంఘనకు పాల్పడే అభ్యర్థులు, రాజకీయ పార్టీలపై తక్షణమే నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి జీ. లింగయ్య నాయక్ ఆదేశాలు జారీ చేశారు.

ఈ మేరకు సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, దీనిని కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ముగ్గురికి మించిన వ్యక్తులు గుమిగూడటాన్ని నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కోడ్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నేడే కౌంటింగ్

- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రేపు (ఫిబ్రవరి 13, 2026) ఉదయం 8 గంటలకు నిర్దేశిత కేంద్రాల్లో లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు ఇప్పటికే నియమితులయ్యారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కేంద్రాల పరిసరాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (నిషేధాజ్ఞలు) అమల్లో ఉంటాయని వెల్లడించారు. కౌంటింగ్ హాల్‌లోకి కేవలం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. వీరందరూ అధికారిక పాసులు తప్పనిసరిగా కలిగి ఉండాలి. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదు. పారదర్శకత కోసం అన్ని కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు.

### ముందుగా పోస్టల్ బ్యాలెట్లు

మొదట పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం సాధారణ బ్యాలెట్ బాక్సులను తెరుస్తారు. వార్డులవారీగా బ్యాలెట్ బాక్సులను టేబుళ్ల వద్దకు తీసుకువచ్చి, ఒక్కో పోలింగ్ స్టేషన్ ఓట్లను 25 చొప్పున కట్టలుగా కడతారు. 25 కంటే తక్కువగా ఉన్న ఓట్లను విడిగా ఉంచి స్లిప్ అంటిస్తారు.ఆ తర్వాత వార్డులోని అన్ని కట్టలను ఒక పెద్ద డ్రమ్ములో వేసి బాగా కలుపుతారు. దీంతో ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయో గోప్యత కాపాడబడుతుంది. అసంపూర్తి కట్టలను సాధ్యమైనంత వరకు పూర్తి కట్టలుగా మారుస్తారు. మిగిలిన చిల్లర ఓట్లను విడిగా ఉంచి లెక్క నమోదు చేస్తారు. ఇదే విధానాన్ని ప్రతి వార్డులో అనుసరిస్తారు.

### రౌండ్ వారీగా లెక్కింపు

డ్రమ్ములో కలిపిన బ్యాలెట్లలో నుంచి ప్రతి రౌండ్‌లో యాదృచ్ఛికంగా 1000 ఓట్లు (40 కట్టలు) తీసి కౌంటింగ్ టేబుళ్లకు పంపిస్తారు. అభ్యర్థులు, నోటా, సందేహాస్పద ఓట్ల కోసం వేర్వేరు చెక్క ట్రేలను ఏర్పాటు చేస్తారు. ప్రతి ఓటును ఏజెంట్లకు చూపించి, చెల్లుబాటు నిర్ధారించిన తర్వాత సంబంధిత ట్రేలో వేస్తారు. అభ్యర్థుల వారీగా వచ్చిన చెల్లుబాటు ఓట్లను 100 చొప్పున కట్టలుగా కడతారు. నోటా, సందేహాస్పద ఓట్లను కూడా అదే విధంగా బండిల్ చేస్తారు. వందకు తక్కువగా ఉన్న ఓట్లను విడిగా ఉంచి సంఖ్యను స్లిప్‌పై నమోదు చేస్తారు. సందేహాస్పద ఓట్లపై రిటర్నింగ్ అధికారి (ఆర్.ఓ) తుది నిర్ణయం తీసుకుంటారు.

## విజయోత్సవాలను అనుమతించం : డీజీపీ శివధర్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో శుక్రవారం జరిగే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు 12 వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 138 కౌంటింగ్ కేంద్రాల వద్ద వ్యూహాత్మకంగా మూడంచెల పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామనీ, లెక్కింపును సవ్యంగా జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీలకు సంబంధించిన ఫలితాలు వెలువరిస్తున్న నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సాయుధ పోలీసు బలగాలతో సమస్యాత్మక ప్రాంతాల వద్ద గస్తీని కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. ముందస్తు చర్యగా గుండాలు, రౌడీలను అదుపులోకి తీసుకోవడంతో పాటు అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై వెబ్ కెమెరాలతో గట్టి నిఘా వేసి ఉంచామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల వరకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధ ఆంక్షలు విధించామని పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతంలో ముగ్గురి కంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని పోలీసులు నియంత్రిస్తారని డీజీపీ తెలిపారు. ఫలితాలు వెల్లడైన తర్వాత గెలుపొందిన వారు విజయోత్సవాలు నిర్వహించడాన్ని కూడా అనుమతించబోమని స్పష్టం చేశారు.

# భారత్ బంద్ సక్సెస్

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా 10 కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మె గురువారం పలు రాష్ట్రాల్లో ప్రభావం చూపింది. రవాణా, బ్యాంకింగ్‌తోపాటు పలు ప్రభుత్వ సేవలు అంతరాయానికి గురయ్యాయి. దీంతో సామాన్య జనజీవనంపై ప్రభావం పడింది.నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ చట్టాలు కార్మికుల హక్కులను బలహీనపరిచాయని, ఉద్యోగ భద్రతను తగ్గించాయని, నియామకాలు, ఉద్వాసనలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చాయని కార్మిక సంఘాలు విమర్శించాయి.

ఎంజీనరేగా పథకాన్ని పునరుద్ధరించాలని, 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్', గ్రామీణ అజీవికా మిషన్‌ను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ముసాయిదా విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు, అణు ఇంధనానికి సంబంధించిన చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ తెలిపిన వివరాల ప్రకారం అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో సమ్మె విజయవంతమైంది. బ్యాంకింగ్, బీమా, పోస్టల్, రవాణా, ఆరోగ్య, బొగ్గు, గనులు, గ్యాస్ పైప్‌లైన్, విద్యుత్ రంగాల్లో సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఒడిశాలోని భువనేశ్వర్, కటక్, రూర్కెలా వంటి నగరాల్లో రవాణా సేవలు నిలిచిపోయినట్లు సమాచారం.

## గురుకులాల్లో కల్తీ భోజనాలపై సీఎం సమీక్షించాలి

- భోజనం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు

వివరాలు 2వ పేజీలో

### పన్ను వసూళ్లు పెరగడం

## మధ్యతరగతిని అణచివేయడం కాదు



- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు పెరగడం అంటే మధ్యతరగతి ప్రజలను అణచివేయడం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. రాజ్యసభలో 2026--27 కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలకు సమాధానమిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పన్ను వసూళ్లు పెరుగుతున్నాయంటే దేశంలో మధ్యతరగతి వర్గం విస్తరిస్తోందనే అర్థమని, అది క్షీణించడం కాదని తెలిపారు. పన్ను వసూళ్ల పెరుగుదలపై వస్తున్న ఆరోపణలను తోసిపుచ్చిన ఆమె, అది ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు నిదర్శనమని పేర్కొన్నారు.

### 48 లక్షల కోట్లు నేరుగా ఖాతాల్లోకి

సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించారన్న విమర్శలను ఖండించిన మంత్రి, ఏ రాష్ట్రానికీ నిధులు నిలిపివేయలేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రూ.48 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. ఈ విధానం ద్వారా అక్రమాలను అరికట్టి రూ.4.31 లక్షల కోట్లను ఆదా చేసినట్లు తెలిపారు.

కేంద్ర నిధులు ఉచిత నగదు కాదని, ప్రతి భారతీయుడు కష్టపడి సంపాదించిన సొమ్మేనని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. రాజకీయ డిమాండ్ల కోసం ప్రజా ధనాన్ని వృథా చేయలేమని స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థ కేవలం ఉన్నత వర్గాలకే కాకుండా మధ్యతరగతికి కూడా విస్తరిస్తోందని పేర్కొన్నారు.

### పన్ను చెల్లింపుదారులు రెట్టింపు


2013--14లో 5.26 కోట్లుగా ఉన్న ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2024--25 నాటికి 12.13 కోట్లకు పెరిగిందని తెలిపారు. గత 11 ఏళ్లలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య రెట్టింపుకంటే ఎక్కువగా పెరిగిందని వెల్లడించారు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు.

### ద్రవ్యోల్బణం, నిరుద్యోగితపై వ్యాఖ్యలు

దేశంలో ద్రవ్యోల్బణ సంక్షోభం లేదని, అది కనిష్ఠ స్థాయిలో ఉందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే ద్రవ్యోల్బణం అదుపులో ఉందన్నారు. అలాగే నిరుద్యోగిత రేటు కూడా తగ్గిందని తెలిపారు. 2017--18లో 5.6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు 2023--24 నాటికి 3.2 శాతానికి తగ్గిందని వెల్లడించారు.

# తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రి

- పదిన్నరేళ్లు నేనే సీఎం
- ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశలోకి
- 2029లో జమిలీ ఎన్నికలు జరిగే అవకాశం
- కేసీఆర్‌పై ఎలాంటి కక్షసాధింపు లేదు
- త్వరలోనే కాళేశ్వరం, ఈ-రేసు అంశాలకు సంబంధించిన అన్ని పత్రాలను అసెంబ్లీలో ప్రవేశపెడతాం
- క్యాబినెట్ విస్తరణ ఆలోచన లేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా మీడియాతో చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు ఎవరూ పోటీ కాదని స్పష్టం చేసిన ఆయన, తెలంగాణకు వచ్చే పదిన్నర ఏళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. "తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రి" అని పేర్కొన్నారు.దేశంలో 2029లో జమిలీ ఎన్నికలు జరిగే అవకాశముందని సీఎం మరోసారి తెలిపారు. తెలంగాణ రాజకీయాలపై స్పందిస్తూ, రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశకు చేరిందని వెల్లడించారు. దర్యాప్తు ఆధారంగానే ప్రతి కేసులో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తమకు ఎలాంటి కక్షసాధింపు లేదని రేవంత్ రెడ్డి చెప్పారు. ఒకవేళ కేసీఆర్‌ను జైలుకు పంపాల్సి వచ్చినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో, ఆ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఎం ప్రశ్నించారు. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలోనూ దర్యాప్తు ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను విచారణ చేసిన ఈడీ, కేసీఆర్, కేటీఆర్‌లను ఎందుకు విచారించడం లేదు?" అని ప్రశ్నించారు. త్వరలోనే కాళేశ్వరం, ఈ-రేసు అంశాలకు సంబంధించిన అన్ని పత్రాలను అసెంబ్లీలో ప్రవేశపెడతానని తెలిపారు.

### సింగరేణి బకాయిలపై వ్యాఖ్యలు

సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్నట్లు వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ, ఆ బకాయిలు కేసీఆర్ హయాంలోనే పేరుకుపోయాయని సీఎం గుర్తు చేశారు. పదేళ్లపాటు ఆ విషయం గురించి కేసీఆర్‌ను ప్రశ్నించని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఇప్పుడు తనను ప్రశ్నించడం సరికాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరూ ఫోన్ ట్యాపింగ్ చేయడం లేదని సీఎం స్పష్టం చేశారు. "ఇతరుల ఫోన్ సంభాషణలు వినడం ఓ మానసిక రోగం. ఫోన్ ట్యాపింగ్ చేస్తే ఆయుష్షు తగ్గుతుంది" అంటూ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని నిర్ణయించామని, ఆ బాధ్యతను నిపుణుల కమిటీకి అప్పగించామని తెలిపారు. మూడు గేట్ల మరమ్మతుల తర్వాత ప్రాజెక్టుకు ఏదైనా నష్టం జరిగితే దాన్ని తమపై మోపేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ విస్తరణపై స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణ చేపట్టాలనే ఎలాంటి ఆలోచన లేదని తేల్చి చెప్పారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "ఇప్పట్లో క్యాబినెట్ విస్తరణ చేయాలన్న ఆలోచన లేదు" అని స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థాగత కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లను మంత్రివర్గ విస్తరణ విషయంపైనే కలిశారన్న వార్తలను ఖండించారు. దావోస్ పర్యటన, మున్సిపల్ ఎన్నికలు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై పార్టీ నాయకులకు వివరించేందుకే మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు కేంద్రంలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతోనే కేంద్ర మంత్రులను పదేపదే కలుస్తున్నానని సీఎం వివరించారు.

హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ల అలైన్‌మెంట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైట్స్ కన్సల్టెన్సీ సంస్థకు పలు సూచనలు చేశారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైస్పీడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతను రైల్వే శాఖ రైట్స్‌కు అప్పగించిన నేపథ్యంలో, ఆ సంస్థ ప్రతినిధులు ఢిల్లీలో ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలైన్‌మెంట్లు, డీపీఆర్ ప్రతిపాదనలను పరిశీలించిన సీఎం పలు సలహాలు అందజేశారు. సమావేశంలో సీఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, సెక్రటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్, రైట్స్ ఈడీ లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అదనపు ధాన్యం సేకరణపై కేంద్రాన్ని కోరిన సీఎం

వానాకాలం (2025--26 సీజన్)

మిగితా 4వ పేజీలో

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

- 10 రోజుల్లో ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం ప్రారంభం
- మూల వేతనంలో 1.5% చందా
- సమానంగా ప్రభుత్వం వాటా
- అపరిమిత నగదు రహిత వైద్య సేవలు అందించనున్న ఈహెచ్ఎస్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం నూతన ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) పది రోజుల్లో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులు తమ మూల వేతనంలో ఒకటిన్నర శాతం చందా చెల్లిస్తే, అదే మొత్తాన్ని ప్రభుత్వం వాటాగా అందించనుంది. ఈ మేరకు సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన ఉద్యోగుల హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశం జరిగింది.

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి ఆధారితులకు నగదు రహితంగా అపరిమిత వైద్య సేవలు అందేలా కొత్త పథకాన్ని రూపుదిద్దుతున్నట్లు ఉద్యోగ సంఘాలు వెల్లడించాయి. పోలీస్ శాఖ ఆరోగ్య భద్రత, ఎక్సైజ్ శాఖ సహాయత పథకాలను కూడా ఈహెచ్ఎస్‌లో చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.ఏటా ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి రూ.528 కోట్ల చందా రానుండగా, ప్రభుత్వం కూడా అదే మొత్తాన్ని జమ చేయనుంది. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా పథక వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రాష్ట్రంలో లక్షా 44 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉండగా, వారి ఆధారితులు 12 లక్షల 84 వేల మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు సభ్యులు ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో ఒకరిని ట్రస్ట్ సీఈవోగా నియమించనున్నారు. త్వరలో మార్గదర్శకాలు రూపొందించి, అవసరమైన మార్పులు చేర్పులు చేయనున్నట్లు సీఎస్ తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల సిబ్బందికి కూడా ఈహెచ్ఎస్ వర్తింపజేయాలన్న డిమాండ్‌పై పథకం అమలులోకి వచ్చిన తర్వాత ట్రస్ట్‌లో తీర్మానం చేయవచ్చని సూచించారు. పక్క రాష్ట్రాల్లో అత్యవసర చికిత్స పొందిన సందర్భాల్లో కూడా ఈహెచ్ఎస్ వర్తింపజేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

### 515 ఆసుపత్రులు గుర్తింపు

నగదు రహిత వైద్య సేవల

మిగితా 4వ పేజీలో

## హైదరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానే



- కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం
- కౌంటింగ్ వేళ అప్రమత్తంగా ఉండాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మహానగరంలో ఎన్ని కార్పొరేషన్లు చేసినా రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు (కేటీఆర్) ధీమా వ్యక్తం చేశారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని విమర్శించారు. "పూజకు పనికిరాని పువ్వు బీజేపీ" అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు.తెలంగాణ భవన్‌లో గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ యువ నేత విజయ్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరగా, కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొందరు ఎమ్మెల్యేలు పార్టీని వీడినా కార్యకర్తలే పార్టీకి వెన్నెముకగా నిలుస్తూ కేసీఆర్ వెంటే ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్‌వన్‌గా నిలిచిందని, అక్కడి 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా బీఆర్ఎస్‌కు ఉందని తేల్చిచెప్పారు.

వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలి? ఎందుకు వేయాలో ప్రజలు ఆలోచించాలని సూచించారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మహిళా ఓటర్లు గుర్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే లేడని భయపడాల్సిన అవసరం లేదని, ఏ అవసరమొచ్చినా పార్టీ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని శ్రేణులకు సూచించారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు బాగుండేవని, ప్రస్తుతం రేవంత్ పాలనలో హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ అదుపుతప్పిందని కేటీఆర్ ఆరోపించారు. పట్టపగలే హత్యలు, దొంగతనాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలవుతున్నాయని, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శించారు.

### 'డబుల్ ఆడుకుంటాం' -- తలసాని

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలు తమకు పాలన నేర్పే స్థితిలో లేరన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని, బీఆర్ఎస్ మరో 15 ఏళ్లు అధికారంలో ఉంటుందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### కౌంటింగ్‌పై అప్రమత్తత అవసరం

మున్సిపల్ ఎన్నికల తరహాలో కౌంటింగ్ రోజున కూడా అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల లెక్కింపులో ఏవైనా తేడాలు గమనిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అవసరమైతే రీకౌంటింగ్ కోరాలని స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణ గ్రామ పంచాయతీలకు కేంద్రం రూ.387 కోట్లు విడుదల

- 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు జారీ
- ఇంకా రూ.2,400 కోట్లు పెండింగ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కేంద్ర ప్రభుత్వం రూ.387 కోట్లు విడుదల చేసింది. ఇది రెండో విడత నిధుల విడుదలగా అధికారులు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యిన అనంతరం ఇప్పటివరకు మొత్తం రూ.646.36 కోట్లను కేంద్రం విడుదల చేసింది.ఈ నిధులను గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ రహదారుల మెరుగుదలకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

2024--25, 2025--26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం కింద గ్రామీణ స్థానిక సంస్థలకు తెలంగాణ రాష్ట్రం దాదాపు రూ.3,000 కోట్ల నిధులకు అర్హత సాధించింది. ఇందులో సుమారు రూ.2,400 కోట్లు ఇంకా విడుదల కావాల్సి ఉన్నట్లు సమాచారం. గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి మిగిలిన నిధులను త్వరితగతిన విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరే అవకాశముంది.

## 114 'రాఫెల్'కు గ్రీన్ సిగ్నల్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రూ.3.60 లక్షల కోట్ల విలువైన ఆయుధాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపిం ది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో 114 రాఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. వీటిలో చాలా విమానాలను 'మేక్ ఇన్ ఇండియా' కింద భారత్‌లోనే తయారు చేయనున్నా రు. అదే విధంగా, సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించే 'కాంబ్యాట్ క్షిపణుల'

కొనుగోలుకు అనుమతి లభించింది. నిఘా, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ అవసరాల కోసం ఉపయోగించే ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లకు డీఏసీ ఆమోదం తెలిపింది. యాంటీ ట్యాంక్ మైన్స్, పీ-8ఐ విమానాలు, మెరైన్ గ్యాస్ టర్బైన్ జనరేటర్లు వంటి కీలక యుద్ధ పరికరాల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది. అయితే రాఫెల్ విమానాల కోనుగోలు విషయంలో ప్రతిపక్షాలు ,పౌరసమాజం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం విదితమే.

## హైదరాబాద్‌లో భారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్

- మాదాపూర్‌లో 11 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- రూ.2,200 కోట్ల విలువైన భూమి తిరిగి స్వీకరణ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగర పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడుతూ ప్రైవేట్ ఆక్రమణలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన 'హైడ్రా (న్ణక్ష్మూాూా)' ప్రాజెక్టు ఫలితాలు ఇస్తోంది. ఈ క్రమంలో గురువారం మాదాపూర్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ సమీపంలో హైడ్రా అధికారులు భారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టి 11 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న భూమి మార్కెట్ విలువ సుమారు రూ.2,200 కోట్లుగా అంచనా వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలోని మోండికుంట చెరువు పరిసరాల్లో ఈ చర్యలు చేపట్టారు.

చెరువు పరిసరాల్లో అక్రమంగా నిర్మించిన వందలాది తాత్కాలిక షెడ్లు, 30కి పైగా వాణిజ్య దుకాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. ముందస్తుగా ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి, తగిన గడువు ఇచ్చిన అనంతరం భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య కూల్చివేత చర్యలు చేపట్టారు. నగరంలో జలాశయాలు, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ఇటువంటి చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. హైడ్రా ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు నగర పరిధిలో గణనీయమైన ప్రభుత్వ భూములు, జలవనరుల ప్రాంతాలు తిరిగి స్వాధీనం అయ్యాయని వెల్లడించారు.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా
- అర్హులందరికీ న్యాయం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ శ్రీమతి సి హెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో శ్రీ జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు.

2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు.

అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పాలనలో పోలీసుల ప్రతిష్ట, ఆత్మగౌరవం దెబ్బతింది..

- రేవంత్ రెడ్డి వెంటనే హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలి..
- పోలీసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న కాంగ్రెస్ నేతలు..
- జగ్గారెడ్డి, ధర్మపురి అరవింద్ లను వెంటనే అరెస్ట్ చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల ప్రతిష్ట మంటగలిసిందని, పోలీసు అధికారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన డిజిపి కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హోం శాఖ మంత్రిగా రాజీనామా చేయాలి. 89 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దౌర్జన్యకర పాలనలో, రాష్ట్రం అతలాకుతలమైంది. నిన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మిర్యాలగూడలో బిఆర్ఎస్ కార్యకర్తల పై, కాంగ్రెస్ నాయకుల దాడులు చేశారు. రేపు ఎన్నికల ఫలితాల దృష్ట్యా బిఆర్ఎస్ కౌన్సిలర్/కార్పొరేటర్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలని కోరారు. బిఆర్ఎస్ అభ్యర్థులను కాంగ్రెస్ నాయకులు కిడ్నాప్ చేసే అవకాశాలు ఉన్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.మున్సిపల్ ఎన్నికల వేళ సంగారెడ్డిలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పోలీసులను అత్యంత దారుణంగా దుర్భాషలాడారని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. 2009లో అండర్ వరల్డ్ మాఫియా నుండి నగరాన్ని కాపాడి, ప్రెసిడెంట్ గ్యాలంటరీ అవార్డు పొందిన శివకుమార్ యాదవ్ వంటి అధికారిని నోటికొచ్చినట్లు తిట్టడం అన్యాయమన్నారు. అలాగే, పోలీసులను తన్నుకుంటూ రావాలని పిలుపునిచ్చిన బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

అబ్బాస్ అనే రౌడీ పై గోల్కొండ పోలీస్ స్టేషన్ లో మర్డర్ సహా పలు కేసులు ఉన్నాయి.జగ్గా రెడ్డి వెంట ఉన్న రౌడీలు సంగారెడ్డి ఓటర్లా ? వారికి అక్కడ ఓటు హక్కు ఉందా? పోలింగ్ స్టేషన్ వద్ద 100 మీ లైన్ దాటి, క్యాండిడేట్ కాని వ్యక్తిని పోలింగ్ స్టేషన్ నుండి బయటకు వెళ్లమని పోలీసులు 5 సార్లు చెప్పినా వెళ్లలేదని, హోం మంత్రి గా మీ పోలీసులను దారుణంగా దుర్భాషలాడిన వారిపై కేసులు పెట్టి పోలీస్ స్టేషన్ లో పడేయలేదు? నైనీ కోల్ బ్లాక్ కుంభకోణం విషయంలో,మీరు ఆడిన హై ఓల్టేజ్ డ్రామాలో ఒక ఐఏఎస్ అధికారిని గురించి ఎన్టీవిలో ప్రసారం చేస్తే జర్నలిస్టులను రాత్రికి రాత్రే అరెస్ట్ చేశారు.మరి జగ్గారెడ్డి విషయంలో ఎందుకు సుమోటో కేసు పెట్టి అరెస్ట్ చేయడం లేదు? జూపల్లి కృష్ణారావు లిక్కర్ బాటిల్స్ పై లేబుల్స్ కంట్రాక్టు విషయంలో రిజ్వి అనే ఐఏఎస్ అధికారికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసి, రాజీనామా చేసేలా చేశారు. పొంగులేటి కొడుకును అరెస్ట్ చేస్తే,రాత్రికి రాత్రే పోలీసు అధికారిని ట్రాన్స్ఫర్ చేశారు.

నా లాగే మీరు తిట్టాలిన ఆదేశాలిస్తున్నారా? రేవంత్ రెడ్డి గారు.పోలీసులను తిడితే ఎందుకు ఇంకా అరెస్ట్ చేయలేదు?కాంగ్రెస్ నాయకులు గంజాయి తాగి,రోడ్లపైకి వచ్చి దుర్భాషలాడుతున్నట్లు అనుమానం.హోం గార్డులు ఏం పాపం చేశారు.? అమ్మకు అయ్యకు పుట్టారా అని ఎలా మాట్లాడుతారు?బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ ను ఎందుకు అరెస్ట్ చేయలేదు.పోలీసులను తన్నకుంట తీసుకురమ్మంటే ఊరుకుంటారా? కేసిఆర్ హయాంలో ఇలా జరగలేదు.ఆనాటి పాలనలో పోలీసుల ప్రతిష్ట పెరిగింది.కేసిఆర్ గారు 700 కోట్లతో అత్యాధునిక కమాండ్ నం కంట్రోల్ సెంటర్ నిర్మించారని అన్నారు. పెట్రోలింగ్ కార్లు, షీ టీమ్స్, పోలీస్ రిక్రూట్ మెంట్ చేపట్టి పోలీసులకు గొప్ప గౌరవం అందించారు. కానీ రేవంత్ రెడ్డి ప్రతీకార వాంఛతో సిట్ మీద సిట్ వేసి వేధిస్తున్నారని, సోషల్ మీడియా ఆక్టివిస్ట్ నల్లబాలు పై మూడు అక్రమ కేసులు పెడితే హై కోర్టు కొట్టేసింది.కానీ రేవంత్ రెడ్డి కోట్ల రూపాయలు ఖర్చు చేసి, ఎలాగైనా నల్లబాలును జైలుకు పంపాలని ప్రయత్నం చేస్తే సుప్రీం చెంప చెల్లుమనిపించింది. అక్రమ కేసులు పెట్టొద్దని హైకోర్ట్ మార్గ దర్శకాలులు జారీ చేసింది, పక్కన కర్ణాటక ప్రభుత్వం తెలంగాణ హై కోర్టు జడ్జిమెంట్ ఆధారంగా మార్గ దర్శకాలు జారీ చేసింది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఆ పని చేయడం లేదు.కానీ తెలంగాణలో మాత్రం ఎలాంటి మార్గదర్శకాలు తీసుకురావడం లేదని తెలియజేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయం నుండి బిఆర్ఎస్ నాయకులు,పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అన్వేష్ రెడ్డి రేవంత్ రెడ్డి పిఆర్ఓ, శ్రీరాం కర్రి మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్, సతీష్ మన్నె చైర్మెన్, తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ వంటి వారు సోషల్ మీడియా వేదికగా బిఆర్ఎస్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రైజింగ్ టాప్ కమ్యునికేషన్స్ ,హైదరాబాద్ గ్రోత్ కారిడారు వంటి పేర్లతో ఆఫీషలు నడుపుతూ, బిఆర్ఎస్ పై, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, ఇతర నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఆధారాలతో సహా రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేశామన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతిష్ట పోయింది.కాంగ్రెస్ నాయకులు పోలీసుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్నారని, పోలీసులను బానిసల కంటే దారుణంగా ట్రీట్ చేస్తున్నారని, రేవంత్ రెడ్డి బాటలోనే కాంగ్రెస్ నాయకులు నడుస్తూ, ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అలాంటి నాయకులను ప్రజలు బహిష్కరించాలని ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.



# వేములవాడ మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేశారని అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ ఓట్లు అభ్యర్థించిన విధానం ప్రశంసనీయమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసిన ప్రతి ఓటరికి పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికలపై పార్టీ సమీక్ష చేపడుతుందని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు .ప్రచార సమయంలో పలు వార్డుల్లో పర్యటించినప్పుడు అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కాకుండా ఉన్నాయని, గత పాలకులు ప్రతి వార్డులో సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న వేములవాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, కష్టపడి పనిచేస్తే ప్రజలు తప్పకుండా గుర్తిస్తారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఫెవికల్ బంధంలా కలిసి కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు చేశాయని ఆరోపించారు. ఓటమి భయంతో ఉద్రిక్తత సృష్టించే ప్రయత్నాలు చేశారని,అయినప్పటికీ గత రెండు సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి ముందుకు సాగామని అన్నారు.

గత పాలకులు ఎమ్మెల్యే పదవిని తమ హోదాకు చిహ్నంగా వాడుకున్నారని, తాను మాత్రం ఆ పదవిని ప్రజల సేవ కోసం వినియోగిస్తున్నానని, ప్రజలు అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీ వెంట నడిచారని అన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని, కౌన్సిలర్ అభ్యర్థులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని అన్నారు. ప్రచార సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి టికెట్ ఆశించి దక్కని వారికి కూడా తాను అండగా ఉంటానని, భవిష్యత్తులో జరిగే ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండీ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, 28 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, బీఎల్‌ఓలు, ఎన్రోలర్లు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో కల్తీ భోజనాలపై సీఎం సమీక్షించాలి

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో పాఠశాలలు, గురుకులాల్లో భోజనంలో కల్తీ కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించేందుకు సమయం కేటాయించకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు కల్తీ ఆహారం మాకొద్దంటూ రోడ్డెక్కిన ఘటనను ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భోజనం నాణ్యతపై విద్యార్థులు నిరసన చేపట్టిన విషయంపై ట్విట్టర్ ద్వారా స్పందించారు. నిత్యం పర్యటనల్లో బిజీగా ఉండే ముఖ్యమంత్రికి గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై సమీక్షించేందుకు తీరిక లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లి కార్యక్రమాల్లో పాల్గొనడం తప్ప గత రెండున్నరేళ్లలో అభివృద్ధి ఏమి జరిగిందని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి పేరుతో అనేకసార్లు ఢిల్లీ పర్యటనలు చేసినప్పటికీ ఫలితం ఏమిటో తాజా కేంద్ర బడ్జెట్‌తో స్పష్టమైందని విమర్శించారు. గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించలేని ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తామంటూ ప్రకటనలు చేయడం విరుద్ధమని అన్నారు. విద్యార్థులు పురుగుల్లేని భోజనం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని, ఉస్మానియా విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖపై దృష్టి సారించి, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# రాజేంద్రనగర్‌ను హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలపడం దుర్మార్గం

- బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఇష్టారాజ్యంగా కొనసాగుతోందని బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి విమర్శించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం దుర్మార్గ నిర్ణయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రాజేంద్రనగర్ నియోజకవర్గం తన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నిర్ణయం రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రాంతానికి నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని కార్పొరేషన్‌లో కలపవద్దని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని ఆరోపించారు.ఈ చర్య వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# బాలుడిని దారుణంగా కొట్టిన అంగన్వాడీ టీచర్

- కన్నుకు తీవ్ర గాయం
- అంగన్వాడీ టీచర్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారి విద్వాన్ష్‌పై టీచర్ దాడి చేసిన ఘటన కలకలం రేపుతోంది. వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొంపెల్లి లక్ష్మీ, విజయ్ కుమార్ దంపతులు తమ కుమారుడు విద్వాన్ష్‌ను ప్రతిరోజులానే అంగన్వాడీ కేంద్రంలో వదిలి తమ పనులకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత బాలుడికి జ్వరం వచ్చిందని, వెంటనే ఇంటికి తీసుకెళ్లాలని అంగన్వాడీ టీచర్ రాణి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. ఆందోళనతో అంగన్వాడీ కేంద్రానికి చేరుకున్న తల్లిదండ్రులు బాలుడి కంటికి, చేతులకు తీవ్ర గాయాలు ఉన్నట్లు గమనించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి కంటికి తీవ్ర గాయం కావడంతో చూపుపై ప్రభావం ఉండే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. తమ కుమారుడిని అల్లరి చేశాడనే కారణంతో టీచర్ రాణి కొట్టిందని ఆరోపిస్తూ బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అంగన్వాడీ టీచర్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర ఆగ్రహం రేకెత్తించింది. చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజెషన్ ప్రక్రియ గురువారం పూర్తి చేశారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న ఎం. నికేష్ అనే విద్యార్థి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి మృతి చెందిన విషయం విదితమే. కళ్ళ ముందే ఎదుగుతున్న కుమారుడు మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

నికేష్ తల్లి లావణ్య ప్రస్తుతం మహమ్మారి క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్నారు. ఒకవైపు పుత్రశోకం, మరోవైపు ప్రాణాంతక వ్యాధితో ఆమె మానసికంగా, శారీరకంగా కృంగిపోతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో చికిత్సకు అవసరమైన భారీ ఖర్చును భరించలేక ఆమె కుటుంబం ఇబ్బందులు పడుతోంది. లావణ్య దయనీయ స్థితిని గమనించిన శివనగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం మానవత్వంతో స్పందించి 8,500 రూపాయలు, అలాగే తోటి విద్యార్థులు 2,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సేకరించి అందజేశారు. లావణ్య చికిత్స నిమిత్తం ఇంకా అధిక మొత్తంలో నిధులు అవసరమవుతున్నాయి. కావున, దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ఉదార స్వభావం కలిగిన వారు మానవతా దృక్పథంతో స్పందించి, ఆమెను ఆర్థికంగా ఆదుకోవాలని, మీ వంతు సహాయం ఒక నిరుపేద తల్లి ప్రాణాన్ని కాపాడటంలో తోడ్పడుతుంది.



# గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్‌కు ఘన సన్మానం

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామ సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన వొల్లాల రజిత వెంకటేష్ లను గ్రామ గౌడ సంఘ సభ్యులు గురువారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంఘ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ, సంఘ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు.సర్పంచ్ తో పాటు నూతనంగా ఏనికైనా కుల వార్డ్ సభ్యులు వొళ్ళాల లత, గోనెపల్లి లావణ్య లను సత్కరించారు. ఈ కార్యక్రమం లో గ్రామ గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయాలి

- పకడ్బందీగా తుది ఏర్పాట్లు పూర్తి చేయాలి.
- వివిధ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష.
- ఇంచార్జి కలెక్టర్ మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మహా శివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి.. విజయవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సౌకర్యంగా చేసుకునేలా తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా ఆధ్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్ధంగా ఉండాలని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని సూచించారు. వృద్ధులు,దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, వీఐపీ, వీవీఐపీల దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# జింక శ్రీధర్ పుట్టినరోజు.. లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాల అందజేత..



**బలగం టీవీ, వేములవాడ:**

బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాలను బహుజన రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల ప్రధాన కార్యదర్శి లక్కె సాగర్ మాట్లాడుతూ.. దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛలు కల్పించే మహత్తర గ్రంథమని, దాని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకుని కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. జింక శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని సామాజిక బాధ్యతగా లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాలను అందజేయడం సంతోషకరమని తెలిపారు. యువత రాజ్యాంగ స్ఫూర్తిని తెలుసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుండా శ్యామ్, నేదురి శ్రీకాంత్,లక్కె దినాకర్, గుడిసె శశి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. హుండీ ఆదాయం రూ. 4.31 కోట్లు

**బలగం టీవీ, తిరుమల**

తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఫిబ్రవరి 11, బుధవారం నాడు 73,652 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ. 4.31 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదే రోజు 25,758 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 18 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 12 నుంచి 15 గంటల సమయం పడుతోందని తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలి..

- బిఆర్‌టియు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్ డిమాండ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




తంగళ్ళపల్లి మండల కేంద్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులు పని బంద్ చేసి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను తుంగలో తొక్కి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కార్మికులకు మరణ శాసనంగా నాలుగు లేబర్ కోడ్ లకు తీసుకువచ్చి కార్మికుల ఉపాధిని దెబ్బతీసి రోడ్డుపాలు చేసే కుట్రలను యావత్ కార్మిక వర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికునికి పని గంటలు పెంచే విధంగా యాజమాన్యంపై అడిగే హక్కు లేకుండా ఇటువంటి సమ్మెలు గాని, నిరసనలు గాని తెలియజేయకుండా సంఘాలుగా ఏర్పడకుండా పని భద్రత లేకుండా కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా మారి కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. ఇప్పటికే బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలు పెట్టి పరిశ్రమ నడవకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. దీని ప్రభావం వల్ల తెలంగాణ ప్రాంతంలో లక్షలాది మంది బీడీ కార్మికులు ఉపాధి కరువై రోడ్డు పాలు కావడం జరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ఉద్యోగులను కార్మికులను రోడ్డుపాలు చేశారన్నారు. ఇప్పటికైనా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను ఉపసంహరించకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆడెపు జ్యోతి, లత, సుమలత పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# టీమిండియా ఆల్‌రౌండ్ షో

**నమీబియాపై 93 పరుగుల ఘన విజయం**





**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా జోరు కొనసాగుతోంది. గ్రూప్--ఏలో భాగంగా గురువారం న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో నమీబియాపై 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచిన భారత్ పాకిస్థాన్‌తో జరిగే హైవోల్టేజ్ మ్యాచ్‌కు ముందు మంచి ఊపును అందుకుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 24 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 61 పరుగులు చేసి మెరిపించాడు. హార్దిక్ పాండ్యా 27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 52 పరుగులు చేసి ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చాడు. నమీబియా బౌలర్లలో కెప్టెన్ ఎరాస్మస్ 4/20తో నాలుగు వికెట్లు పడగొట్టాడు.

209 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా 18.2 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. స్టీన్‌కాంప్ (29), జాన్ ఫ్రిలింక్ (22) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3/7తో అద్భుతంగా రాణించగా, హార్దిక్ పాండ్యా 2/21, అక్షర్ పటేల్ 2/20తో రెండేసి వికెట్లు తీశారు.పవర్‌ప్లేలోనే వరుణ్ చక్రవర్తిని బరిలోకి దింపిన కెప్టెన్ సూర్యకుమార్ వ్యూహం ఫలించింది. అతని స్పిన్ దెబ్బకు నమీబియా బ్యాటర్లు తడబడిపోయారు. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు ఆరుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ముగ్గురు బ్యాటర్లు ఖాతా కూడా తెరవలేకపోయారు.

ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన హార్దిక్ పాండ్యాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో టీమిండియా గ్రూప్‌లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ పాకిస్థాన్‌తో జరగనున్న తదుపరి మ్యాచ్‌కు సిద్ధమైంది.




## 'హే భగవాన్' ట్రైలర్ లాంచ్

**బలగం టీవీ, హైదరాబాద్**

సుహాస్, శివానీ నాగరం, సీనియర్ నటుడు నరేష్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'హే భగవాన్' ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. గోపి అచ్చర దర్శకత్వం వహించగా, బి. నరేంద్రరెడ్డి నిర్మించారు. బన్నీవాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగ్ర కథానాయకుడు సాయిదుర్గతేజ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు రామ్ అబ్బరాజు కూడా పాల్గొని సినిమా విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు.

నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ, ఇటీవల ఫస్ట్ కాపీ చూశానని, సినిమా ఖచ్చితంగా విజయాన్ని సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. ప్రీరిలీజ్ ఈవెంట్ సందర్భంగా కథను సరిగ్గా ఊహించిన ఐదుగురికి రూ.20 వేల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. సుహాస్ కెరీర్‌లో ఇదే అతిపెద్ద విజయం అవుతుందని వంశీ నందిపాటి ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో సుహాస్ మాట్లాడుతూ, "ఆద్యంతం నవ్వులు పంచే సినిమా ఇది. నరేష్ గారితో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది" అన్నారు. దర్శకుడు గోపి అచ్చర మాట్లాడుతూ, ట్రైలర్ ద్వారా కథను గెస్ చేయలేరని, అందుకే 'నాట్ ఎ ట్రైలర్' పేరుతో విడుదల చేశామని తెలిపారు. తండ్రి--కొడుకుల భావోద్వేగాలతో సాగే ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, శివానీ నాగరం కూడా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## వాలెంటైన్స్ డే కానుకగా 'కపుల్ ఫ్రెండ్లీ' విడుదల

- **నేటి సాయంత్రం నుంచి షోలు**

**బలగం టీవీ, హైదరాబాద్**




యంగ్ హీరో సంతోష్ శోభన్, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి జంటగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమా ప్రీ-రిలీజ్ ప్రెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించగా, చిత్రబృందం విజయంపై ధీమా వ్యక్తం చేసింది.హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ, "నాకు సక్సెస్ రావాలని అందరూ కోరుకోవడం ఆనందంగా ఉంది. మొదట టైటిల్ చెప్పినప్పుడు కొంత సందేహం కలిగింది. కానీ సినిమా పూర్తిగా చూసిన తర్వాత ఇదే సరైన టైటిల్ అనిపించింది. పాజిటివ్ వైబ్‌తో వస్తున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను" అని తెలిపారు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందని, ప్రేక్షకులు ఈ ప్రేమకథను ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, "ఇది స్వచ్ఛమైన ప్రేమకథ. కుటుంబ నేపథ్యంలో సాగే చక్కటి ఎంటర్‌టైనర్. హీరో-హీరోయిన్ల మధ్య ఎమోషన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయి. ఫిబ్రవరి 13 సాయంత్రం నుంచే థియేటర్లలో ప్రత్యేక ప్రదర్శనలు ప్రారంభమవుతాయి" అని తెలిపారు. హైదరాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ప్రీమియర్ షోలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై అజయ్ కుమార్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ లభించినప్పటికీ, కుటుంబంతో చూడదగిన పాజిటివ్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని చిత్ర యూనిట్ పేర్కొంది. స్టార్ హీరో ప్రభాస్ నుంచి కూడా ప్రశంసలు అందుకున్న ఈ సినిమా వాలెంటైన్స్ డే వీకెండ్‌లో యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




## టీ20 ప్రపంచకప్‌లో ఇటలీ సంచలనం

- **నేపాల్‌పై 10 వికెట్ల ఘన విజయం**

**బలగం టీవీ, ముంబై**

టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి అర్హత సాధించిన ఇటలీ జట్టు సంచలన విజయం సాధించింది. వాంఖడే స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ విజయంతో ప్రపంచకప్‌లో తమ తొలి గెలుపును అందుకుంది.

నేపాల్ నిర్దేశించిన 123 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ జట్టు కేవలం 12.4 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనింగ్ సోదర ద్వయం ఆంథోని మోస్కా (32 బంతుల్లో 62; 3 ఫోర్లు, 6 సిక్సర్లు), జస్టిన్ మోస్కా (44 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతంగా ఆడి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది. ఇటలీ బౌలర్లలో క్రిషన్ కలుగమగె 3/18, బెన్ మనెంటి 2/9తో రాణించారు. నేపాల్ తరఫున ఆరిఫ్ షేక్ 27 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే ఆరుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమవడంతో జట్టు పెద్ద స్కోరు చేయలేకపోయింది. మొదటి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్ జట్టు ఈ మ్యాచ్‌లో మాత్రం తడబడింది. సిడ్నీలో పుట్టి పెరిగిన మోస్కా సోదరులు ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడి 7.2 ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించారు. ఈ విజయంతో ఇటలీ జట్టు టోర్నీలో తన సత్తాను చాటుతూ క్రికెట్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందింది.

# తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

పంటకు సంబంధించి తెలంగాణలో అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ స్వీకరించాలని కేంద్ర ఆహార, పౌర సరఫరాల మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం కోరారు. అనుమతించిన 53.73 ఎల్ఎంటీలకు అదనంగా భారీ ఉత్పత్తి కారణంగా సేకరించిన ధాన్యాన్ని 10 శాతం నూకతో ఎఫ్‌సీఐ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే 2024--25 యాసంగి పంటకు సంబంధించి 5 శాతం నూకతో అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. కస్టమ్స్ మిల్లింగ్ రైస్ గడువును మరో రెండు నెలలు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. 2014--15 వానాకాలం బియ్యానికి సంబంధించిన రూ.1,468.94 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన రూ.343.27 కోట్ల బకాయిలు చెల్లించాలని కూడా అభ్యర్థించారు.

**కృష్ణా--వికారాబాద్ రైల్వే మార్గానికి కేంద్ర నిధులు కోరుతూ**

కృష్ణా--వికారాబాద్ రైల్వే మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను సీఎం కోరారు. ఈ మార్గం వల్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. టేకులోడ్ ప్రాంతంలో లైమ్ స్టోన్ నిక్షేపాలు గుర్తించిన విషయాన్ని, సిమెంట్, జౌళి పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.

హైదరాబాద్--చెన్నై (778 కి.మీ.), హైదరాబాద్--బెంగళూరు (586 కి.మీ.), హైదరాబాద్--పుణే (556 కి.మీ.) హైస్పీడ్ కారిడార్లకు శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని తెలిపారు. శంషాబాద్ నుంచే ఈ మార్గాలు ప్రారంభమైతే ట్రై జంక్షన్‌గా మారుతుందని పేర్కొన్నారు. పనులు త్వరలో ప్రారంభిస్తామని రైల్వే మంత్రి హామీ ఇచ్చారు.మామునూరు విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని విజ్ఞప్తివరంగల్ సమీపంలోని మామునూరు విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును సీఎం కోరారు. భూసేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్గో సేవలు, ఎంఆర్ఓ సదుపాయాలు కల్పించాలని అభ్యర్థించారు. అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విమానాశ్రయ పనుల ప్రారంభానికి అవసరమైన చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

**గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా ఈసా--మూసీ నదుల సంగమంలో నిర్మించనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం ఆహ్వానించారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో శాంతి చిహ్నం, జాతీయ మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, చేనేత ప్రోత్సాహక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులో జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కోరగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఇప్పటివరకు 515 ఆసుపత్రులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. సమావేశంలో ఉన్నతాధికారులు సీవీ ఆనంద్, మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రస్తుత వ్యవస్థలో సమస్యలు**

ప్రస్తుతం రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందుతున్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రులకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల కార్డులు చెల్లుబాటు కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ముందుగా బిల్లులు చెల్లించి రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసినా పూర్తి మొత్తాలు తిరిగి రాకపోతున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**1.5% ఉద్యోగి భాగస్వామ్యం**

నూతన పథకంలో ఉద్యోగి మూల వేతనంలో 1.5% చందా విధించనున్నారు. ఉదాహరణకు రూ.50,000 బేసిక్ ఉన్న ఉద్యోగి నెలకు రూ.750 చెల్లించాల్సి ఉంటుంది. తొలుత బీమా విధానంలో అమలు చేయాలని భావించినప్పటికీ, చివరికి ట్రస్ట్ విధానంలోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పర్యవేక్షణలో పథకం అమలుకానుంది.